క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్(వస్త్రలత), మానస హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆర్కే అయోధ్య తెలిపారు. వస్త్రలతలోని ది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ షాపు నంబర్ 196లో నిర్వహించే ఈ శిబిరంలో గ్యాస్ట్రో, మానసిక సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 93923 18114 నంబర్‌లో సంప్రదించాలని అయోధ్య తెలిపారు.

లలితాంబికా పీఠంలో ప్రత్యేక పూజలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వారాహి నవరాత్రుల్లో భాగంగా పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీ లలితాంబికా పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో మూడో రోజైన బుధవారం వారాహి అమ్మవారిని పోత్రిరిణి వారాహిగా అలంకరించారు. అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పూజలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శివలీల మాతాశ్రీ అనుగ్రహ భాషణం చేశారు.

లింగ వివక్ష చూపరాదు



భవానీపురం(విజయవాడపశ్చిమ): చిన్నారుల పట్ల లింగ వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూడాలని, తద్వారా ఉత్తమ సమాజం ఏర్పడుతుందని పలువురు వక్తలు అన్నారు. హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ సహకారంతో చైల్డ్ ఫండ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ కాలనీ, కండ్రిక, రాజరాజేశ్వరీపేట, వాంబే కాలనీ ప్రాంతాల్లో జెండర్–వాతావరణ మార్పుల కారణాలు–నివారణ అనే అంశంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ నాగమణి, ఏసీడీపీఓ జ్యోత్స్న, కార్పొరేటర్ ధనశేఖర్, పంచాయతీ సెక్రటరీ ఉషారాణి, జెండర్ ఎక్స్‌పర్ట్ మంజూష, మహిళా పోలీసులు గాయత్రి, సుజ్ఞానం, కల్యాణి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అశోక్‌కుమార్ పాండా, రాజ్‌కుమార్, కమ్యూనిటీ మొబలైజర్స్ నవీన్, రజని, లావణ్య, పుణ్యవతి, దివ్య పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురి చేస్తున్న అత్త, భర్తపై వివాహిత కొత్తపేట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబర్ 231లో కలిగి రేవతి, రాము దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి వివాహమై 7 నెలలు. పెయింటింగ్ పని చేసే రాము తరుచూ భార్య రేవతిని అనుమానిస్తూ కొడుతున్నాడు. ఈ నెల 20వ తేదీన రేవతి సాయిరాం థియేటర్ సమీపంలోని నివాసం ఉండే తల్లి వద్దకు వచ్చింది. అయితే అక్కడకు వచ్చిన రాము, అతని తల్లి వెల్లమ్మ రేవతిని ఇంటికి వచ్చేయాలని అడిగారు. నాలుగు రోజులు ఆగి ఇంటికి వస్తానని చెప్పిన రేవతిని తీవ్రంగా దూషించి గొడవ పడ్డారు. దీంతో బాధితురాలు అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం నియోజకవర్గం కొండపల్లి మున్సిపాలిటీ డ్వాక్రా ఆర్పీలను సెర్ప్ నుంచి మెప్మాలోకి విలీనం చేయించిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌కు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కొండపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ డ్వాక్రా ఆర్పీలను సెర్ప్ నుంచి మెప్మాలో విలీనం చేసేందుకు సాంకేతిక సమస్య ఎదురవ్వగా మంత్రి జోగి రమేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించామని తెలిపారు. తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆర్పీల సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని చెప్పారు. దీంతో మున్సిపల్ కౌన్సిలర్ ఎం.చంద్రంతో పాటు మెప్మా ఎండీ విజయలక్ష్మిని కలవగా వారు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించారని తెలిపారు.

లోటస్ ల్యాండ్ మార్క్ వెల్ఫేర్ కార్యవర్గం ఎన్నిక

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కేదారేశ్వరపేటలోని లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్–1 కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు బి.త్రినాథ్, బి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వీవీపీ ధర్మారాయుడు, ఉపాధ్యక్షుడు ఎండీ మొహిద్దీన్, ప్రధాన కార్యదర్శి వెలగా సురేష్, సంయుక్త కార్యదర్శులు శర్మ, శ్రీనివాసరావు, కార్యదర్శి వై.బాబురావు, కోశాధికారిగా పూర్ణచంద్రరావులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

యోగాతో స్థిరమైన, బలమైన మనస్తత్వం

- కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు
- ఘనంగా యోగా దినోత్సవం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, నిర్వాహకులు



గుప్తా సెంటర్‌లో యోగా చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): యోగా సాధనతో స్థిరమైన, బలమైన మనస్తత్వం సొంతమవుతుందని ఎన్టీఆర్ జిల్లా ఎస్.ఢిల్లీరావు తెలిపారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం ఆవరణలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. కలెక్టర్ ఢిల్లీరావు ముఖ్యఅతిథిగా హాజరై యోగసాధకులతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ... ప్రస్తుతం కొన్ని దేశాల్లో జరుపుకుంటున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచమంతా ఘనంగా జరుపుకునే రోజు రావాలని ఆకాంక్షించారు. మనస్సు, శరీరం ఆరోగ్యంగా ఉన్న వక్తులతో కూడిన సమాజం కోసం ప్రతి ఇల్లు యోగ సాధన నిలయంగా మారాలన్నారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం అనే అంశాన్ని భారత ప్రభుత్వం యోగా డే థీమ్‌గా ప్రకటించిందన్నారు. యోగ సాధన చేయడం వల్ల శరీరంలోని అన్ని అవయవాల పనితీరు మెరుగవుతుందన్నారు. అనారోగ్య సమస్యలను యోగ సాధన మంచి పరిష్కరమార్గమని కలెక్టర్ ఢిల్లీరావు చెప్పారు. అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ.నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ యోగా చేయాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. యోగా గురువు అంకాల సత్యనారాయణను కలెక్టర్ ఢిల్లీరావు సత్కరించారు. కలెక్టర్ యోగ సాధకులతో యోగాసనాలు, ప్రాణాయామం చేయించి యోగా గురువుగా మారారు. యోగ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం యోగ సాధకులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ స్థానిక రహదారులపై ర్యాలీ చేశారు. ర్యాలీని విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీహెచ్.లక్ష్మీపతి జెండా ఊపి ప్రారంభించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.ఇక్బాల్, యల్లారావు, లావణ్యకుమార్, పి.ప్రశాంత్‌కుమార్, ఎం.డి.సిరాజ్, వల్లభనేని ప్రసాద్, రెడ్డమ్మ, శ్రీనివాస్, పివీ.సత్యనారాయణ, మిరియాల వెంకటేశ్వరరావు, కే.కృష్ణప్రసాద్, ఎస్వీఆర్ నాయుడు, అప్పారావు, మహిపాల్ పాల్గొన్నారు. యోగాసనాల అనంతరం కూచిపూడి నృత్యాన్ని యోగాను కలిపి నృత్యకారిణి జి.విజయ గౌరి తన బృందంతో చేసిన నృత్యం ఆకట్టుకుంది.

సిద్ధార్థ వైద్య కళాశాలలో...

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సిద్ధార్థ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని ఏసీ లెక్చర్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం జగన్మోహనరావు, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ దారా వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ సూచించారు.

హరిత బరంపార్క్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ(ఏపీటీఏ) సంయుక్త ఆధ్వర్యంలో భవానీపురంలోని పున్నమిఘాట్‌లో బుధవారం యోగాసనాల కార్యక్రమం జరిగింది. ఏపీటీఏ డెప్యూటీ సీఈవో వి.రాముడు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ విద్యా సంస్థలకు చెందిన యువ టూరిజం క్లబ్స్ సభ్యులు యోగా చేశారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ జీవనశైలిలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏపీటీఏ అసిస్టెంట్ డైరెక్టర్ కెపాజిటీ బిల్డింగ్ డాక్టర్ లజ్వంతి నాయుడు, టూరిజం మేనేజర్ రవీంద్రబాబు, అమరావతి బోటింగ్ క్లబ్ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ముప్వ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో..

శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం కేసీ నిత్య సాధన యోగ సాధకులు విద్యాధరపు గుప్తా సెంటర్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి కల్యాణమండపం దగ్గర యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. నెరుసు సీతారామయ్య, గుండు జనార్దనరావు, ఆంజనేయులు, హరిబాబు, వెంకట్, వెంకటేశ్వరరావు, శ్రీధర్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్యరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వక్కలగడ్డ శ్రీకాంత్, మైలవరపు దుర్గారావు, పిళ్లా రవి పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసికోల్లాసం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాతో శారీరక, మానసికోల్లాసంతో పాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల క్రీడా విభాగం, జాతీయ సేవా పథకం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యోగా గొప్ప ఆరోగ్య సాధనమన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించేందుకు పాటుపడాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవటానికి యోగా అండగా నిలుస్తుందన్నారు. యోగా దినోత్సవాన్ని 150కు పైగా ప్రపంచ దేశాలు జరుపు కుంటున్నాయన్నారు. తమ కళాశాలలో ప్రతి విద్యార్థి యోగా సాధన చేసే విధంగా విద్యాబోధన రూపొందించామన్నారు. తొలుత కళాశాల డిప్లొమో ఇన్ యోగా విద్యార్థులు పలు విన్యాసాలను ప్రదర్శించారు. విద్యార్థులతో యోగా గురువులు ఎన్ సాంబశివరావు, రాజేష్‌లు యోగా ఆసనాలను వేయించారు. కార్యక్రమాన్ని క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావు నిర్వహించగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వి.శేషగిరిరావు, డి.పవన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో..

పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సనాతన యోగా కేంద్రం డైరెక్టర్ జి.రాజేష్ యోగా ఆవశ్యకతను వివరించారు. యోగాసనాలను వివరిస్తూ విద్యార్థులతో ఆచరింపజేశారు. ఆయన మాట్లాడుతూ యోగా భారతీయ జీవన విధానమన్నారు. దీనిని అందరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, బి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరపాటి హైస్కూల్‌లో...

పాతబస్తీలోని కూరపాటి చంద్రశేఖరరావు ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఆయన మాట్లాడుతూ యోగ భారతీయుల పూర్వీకులు ఇచ్చిన సంపద అని, ప్రపంచ దేశాలు మన దేశాన్ని అనుసరిస్తున్నాయన్నారు. నిత్యం యోగ చేయడం వలన మానసిక ఉత్తేజం, ప్రశాంతత లభిస్తాయన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చదువు వలన ఏర్పడే మానసిక ఒత్తిడి యోగాతో మటుమాయం అవుతుందని కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాలకు చెందిన ఎనిమిదో ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ విద్యార్థులకు కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు యోగాసనాలు వేయించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బ్రహ్మేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో..

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం, న్యూ రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ నందు 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్(ఇన్‌చార్జి) డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ప్రధాన మంత్రి మోదీ సందేశాన్ని దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా మానవ జీవితంలో ఒక భాగం కాకుండా జీవితంలో మమేకమై ఉండాలన్నారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ ముసిలి బాబు యోగా ఆసనాలను వేయించారు. కార్యక్రమానికి అనుసంధానకర్తగా ఏజేవీ సాయి ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ సి.మురళీకృష్ణ, పరిశోధన అధికారులు, వైద్యులు సుజాత పి.డోకే, కె.మిధున మోహన్, సవిత, కే.అనుమోల్, కె.నిశాంత్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని, తద్వారా ఆరోగ్యంతో పాటు శరీరాకృతిలో వచ్చే మార్పులను నియంత్రించవచ్చని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై.అపర్ణ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అప్‌కాస్ట్, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో భవానీపురంలోని అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్(ఆర్ఎస్‌సీ)లో బుధవారం పలు పాఠశాలల విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్య జీవితంలో డైట్ కంట్రోల్‌తో పాటు యోగా సాధనతో రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సైన్స్ సిటీ సీఈవో జయరామిరెడ్డి, సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జేడీ రావు, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ మైనం హుస్సేన్, యోగా టీచర్లు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న యోగ సాధకులు



పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న సనాతన యోగా కేంద్రం డైరెక్టర్ రాజేష్



విద్యార్థులతో అప్‌కాస్ట్ ఎంఎస్ డాక్టర్ అపర్ణ, సైన్స్ సిటీ సీఈవో జయరామిరెడ్డి



కేబీఎన్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు



పున్నమిఘాట్‌లో యోగా చేస్తున్న యువ టూరిజం క్లబ్ సభ్యులు


యోగాతో వ్యాధులు దూరం



యోగా డే వేడుకల్లో డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జీవనశైలి వ్యాధులకు దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగా, ధ్యానం దినచర్యలో భాగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏపీఐఐసీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది యోగసనాలు చేశారు. అనంతరం డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ప్రతి ఆరోగ్య కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్స్, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల ద్వారా యోగా, ధ్యానం చేయాలని పక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అలా చేయడం ద్వారా జీవనశైలి వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, మానసిక వ్యాధులు నియంత్రించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జె నరసింహనాయక్, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, డీపీఓ మహేశ్వరరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కనకదుర్గ లలిత పారాయణ బృందం ఆధ్వర్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆషాఢ సారెను బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కొత్తగుళ్ల సమీపంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆర్యవైశ్య కల్యాణ మందిరం నుంచి కేరళ డప్పు వాయిద్యల, సన్నాయి మేళాల నడుమ మహిళలు అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుతో పాటు కన్యకాపరమేశ్వరి కమిటీ సభ్యులు, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శ్రీ కనకదుర్గ లలితా పారాయణం బృందం సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు గ్రంధి రాము మాట్లాడుతూ నాలుగేళ్లుగా దుర్గమ్మకు సారె సమర్పిస్తున్నామరు. కార్యక్రమంలో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, దుర్గగుడి ట్రస్ట్ సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తయ్య, కేసరి నాగమణి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పోలేపల్లి సుబ్బు, శ్రీ కన్యకాపరమేశ్వరి సత్రం అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు వెంకటలక్ష్మి వరప్రసాద్, బయన రాజేష్ పాల్గొన్నారు.


టెన్నిస్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం బైపాస్ రహదారి పక్కనగల స్టేడియం ప్రతిపాదిత స్థలంలో ఏర్పాటు చేసిన టీ–10 టెన్నిస్ బాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం కొద్ది సేపు క్రికెట్ ఆడి సందడి చేసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ గ్రౌండ్‌లో స్థానికుల కోసం వాకింగ్ ట్రాక్ సిద్ధం చేశామని చెప్పారు. దీంతో పశ్చిమ నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక సాకారం కానుందన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, మైలవరపు దుర్గారావు, రాయన నరేంద్ర పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లతో జీవనోపాధి



ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను విక్రయించే అవుట్‌లెట్ల ద్వారా ఎంతో మందికి జీవనోపాధి లభిస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఫిష్ ఆంధ్ర రిటైల్ అవుట్‌లెట్ ఏర్పాటుకు రూ.20 లక్షల వ్యయంకాగా ప్రభుత్వం నుంచి 60 శాతం సబ్సిడీ మంజూరైందన్నారు. సబ్సిడీ రూ.12 లక్షలు పోను రూ.8 లక్షల పెట్టుబడితో ఈ వ్యాపారాన్ని ప్రారంభించారని చెప్పారు. ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్‌ను మరింత ప్రోత్సహించేందుకు మత్స్య శాఖ ఇటువంటి అవుట్‌లెట్ల ఏర్పాట్లను చేపట్టిందన్నారు. రాష్ట్రంలో లభించే సముద్ర, రైతులు పెంచే మత్స్య ఉత్పత్తులను ఫిష్ ఆంధ్ర పేరుతో హబ్‌లు, అవుట్‌లెట్లు, యూనిట్స్, కియోస్కల ద్వారా విక్రయాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాల భరోసా ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకురాలు పోగుల రామలక్ష్మిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గంగవరపు శివాజీ, ధనేకుల చౌదరి, జాస్తి జగన్, గేరా సుమన్ పాల్గొన్నారు.

గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

విజయవాడకల్చరల్: గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సూచించారు. శ్రీవారి శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించే సంగీత సద్గురువుల ఆరాధనా మహోత్సవాలను శివరామకృష్ణ క్షేత్రంలో బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమ పర్యవేక్షకుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి సంగీతోత్సవాలను వారి శిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు నిర్వహించే వారన్నారు. వారి ఆరాధనా ఉత్సవాలను వారి శిష్యప్రశిష్యులు నిర్వహిస్తున్నారని ఇదే సంప్రదాయం నాటి నుంచి కొనసాగుతోందన్నారు. భువన కృతి గాత్ర కచేరితో ప్రారంభమయ్యాయి. ఎం.చంద్రశేఖర్, బీకే ఇందూ, గజ్జెల రమేష్‌బాబు వాగ్గేయకార కృతులను ఆలపించారు. పెరవలి నందకుమార్ నిర్వహించిన వయోలిన్ సోలో ఆకట్టుకుంది.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను పుట్టింటి నుంచి కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నారని వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేట ముక్కా అప్పారావు వీధికి చెందిన పల్లి భవ్యలత, దుర్గారావు భార్యభర్తలు. వీరిది ప్రేమ వివాహం కాగా దుర్గారావు ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా దుర్గారావు భార్య భవ్యలతను పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురావాలని వేధింపులకు గురి చేయడమే కాకుండా నలుగురిలో చులకనగా మాట్లాడసాగాడు. నాలుగు రోజుల కిందట భవ్యలతను దుర్గారావు కొట్టి ఇంటి నుంచి గెంటేశాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

భార్యకు వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురి చేస్తున్న భర్తపై వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ నందిపాటి జీవరత్నం వీధికి చెందిన పెద్దేటి సరితను గుంటూరు శారదాకాలనీకి చెందిన ఏసుదాసుకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. ఏసుదాసు మార్బుల్ పని చేస్తుంటాడు. వీరికి ఇద్దరు సంతానం కాగా ఏసుదాసు మద్యానికి బానిసై ఇంట్లోని సామగ్రిని తాకట్టు పెడుతున్నాడు. పిల్లలను పట్టించుకోకుండా భార్యను వేధింపులకు గురి చేయడంతో 3 నెలల కిందట సరిత పుట్టింటికి వచ్చేసింది. భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.